

# విభారే

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 03 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 78 పేజీలు : 4 వెల : రూ 3-00

# బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీ భారీ విజయం





బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. 90,533ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సుధ విజయం సాధించారు. 13 వ రౌండ్లో వైఎస్సార్‌సీపీకి 362 ఓట్లు, బీజేపీకి 40 ఓట్లు, కాంగ్రెస్‌కు 12 ఓట్లు పోల్ అయ్యాయి. మొత్తంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ దాసరి సుధ 90,550 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. 12వ రౌండ్లోనూ 'ఫ్యాన్' హవా కొనసాగింది. ఈ రౌండ్లో 483 ఓట్ల ఆధిక్యం సాధించిన వైఎస్సార్‌సీపీ మొత్తంగా 90,211 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపును సొంతం చేసుకుంది. అన్ని రౌండ్లలో కలిపి వైఎస్సార్‌సీపీ 1,11,849 ఓట్లు, బీజేపీ 21,638 ఓట్లు, కాంగ్రెస్ 6,223 ఓట్లు సాధించాయి. ఇప్పటికే గెలుపు ఖాయం చేసుకున్న వైఎస్సార్‌సీపీ 11వ రౌండ్లోనూ సత్తా చాటింది. తాజా రౌండ్‌లో లభించిన 4584 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్‌సీపీ 90,089 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ 1,11,710 ఓట్లు ,బీజేపీ 21,621 ఓట్లు, కాంగ్రెస్ 5968 ఓట్లు సాధించాయి. 11:40

బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. 10 రౌండ్లు ముగిసేసరికి వైఎస్సార్‌సీపీ 85,505 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు అన్ని రౌండ్లలో కలిపి వైఎస్సార్‌సీపీ 1,06,088 ఓట్లు సాధించగా.. బీజేపీ 20,583, కాంగ్రెస్ 5968 ఓట్లు సాధించింది. అధికారికంగా మరో రౌండ్ ఫలితం వెలువడాల్సి వుంది.ఽతిఎవ: 11:31 ఎం: బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీ భారీ విజయం సాధించింది. అధికారికంగా మరో మూడు రౌండ్ల ఫలితాలు వెలువడాల్సి వుంది. 8 రౌండ్లు ముగిసేసరికి వైఎస్సార్‌సీపీ 68,492 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. 11:25 ఎం: బద్వేల్‌లో ఎనిమిదో రౌండ్ ముగిసింది. 8వ రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ 9691, బీజేపీ 1964, కాంగ్రెస్‌కు 774 ఓట్లు పోలయ్యాయి. 68,492 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది. 11:14 ఎం: బద్వేల్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ 60,826 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. భారీ మెజార్టీ దిశగా డాక్టర్ దాసరి సుధ సాగుతున్నారు. 11:7 ఎం: బద్వేల్‌లో ఏడో రౌండ్ ముగిసింది. ఏడో రౌండ్‌లో వైఎస్సార్‌సీపీకి 10,726, బీజేపీకి 1924, కాంగ్రెస్‌కు 841 ఓట్లు పోలయ్యాయి. ఏడు రౌండ్లు ముగిసే సరికి వైఎస్సార్‌సీపీ 74991 ఓట్లు సాధించింది. 11:01 ఎం: బద్వేలులో ఆరో రౌండ్ ముగిసింది. ఆరో రౌండ్‌లో వైఎస్సార్‌సీపీకి 11,383, బీజేపీకి 1940, కాంగ్రెస్‌కు 531 ఓట్లు పోలయ్యాయి. ఆరు రౌండ్లు ముగిసేసరికి వైఎస్సార్ వైఎస్సార్‌సీపీ 64,265 ఓట్లు సాధించింది.ఽతిఎవ: 10:45 ఎం: బద్వేల్‌లో ఆరో రౌండ్ ముగిసే సరికి 52,024 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీకి 64,265 ఓట్లు, బీజేపీకి 12,241 ఓట్లు పోలయ్యాయి.ఽ 10:45 బద్వేల్‌లో భారీ విజయం దిశగా వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ ఆధిక్యత 50 వేలు దాటింది. 10:38 ఎం: బద్వేల్‌లో ఆరో రౌండ్ ముగిసింది. 52,024 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది. 10:26 ఎం: భారీ విజయం దిశగా వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. బద్వేల్‌లో ఐదో రౌండ్ ముగిసే సరికి 42,824 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది. 10:06ఎం: బద్వేలులో వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతోంది. భారీ విజయం దిశగా డాక్టర్ దాసరి సుధ సాగుతున్నారు. 9:57 ఎం: నాలుగో రౌండ్ ముగిసే సరికి 30,412 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది. 9:36 ఎం: బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతోంది. మూడో రౌండ్ ముగిసే సరికి 23,754 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది.: తొలి రౌండ్‌లో 9వేల ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ కొనసాగుతోంది. తొలి రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ 10,478, బీజేపీ 1688, కాంగ్రెస్‌కు 580 ఓట్లు లభించాయి.

ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం..

8:36 ఎం: బద్వేల్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. పోస్టల్ బ్యాలెట్‌లో వైఎస్సార్‌సీపీ ఆధిక్యంలో ఉంది. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. కలసపాడు మండలం ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలైంది.

8:24 ఎం: పోస్టల్ బ్యాలెట్‌లో వైఎస్సార్‌సీపీ ఆధిక్యంలో ఉంది. రిటర్నింగ్ అధికారి, అభ్యర్థుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్నారు. 8:00 ఎం: వైఎస్సార్ జిల్లా బద్వేలు ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో వైఎస్సార్‌సీపీ ఆధిక్యంలో ఉంది. మొత్తం 259 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. రిటర్నింగ్ అధికారి, అభ్యర్థుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్నారు.

పట్టణంలోని గురుకుల ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లుచేశారు. కోవిడ్ మార్గదర్శకాలకు అనుగుణంగా భారీ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇందుకోసం నాలుగు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల కమిషన్ జారీచేసిన కోవిడ్ మార్గదర్శకాలను అనుసరించి ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో ఏడు టేబుళ్లను ఏర్పాటుచేశారు. ప్రతి కేంద్రంలో ఆర్వో, ఏఆర్వోలకు ఒక టేబుల్ ఏర్పాటుచేశారు. ఆర్వో ఉన్న కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ర్యాండమ్ చెకింగ్ కోసం ఒక వీవీ ప్యాట్ కేంద్రం ఏర్పాటుచేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో ఒక సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. గరిష్టంగా 12 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. మధ్యాహ్నం 12గంటలకు తుది ఫలితం వెల్లడయ్యే అవకాశముంది. ఇప్పటివరకు సర్వీసు ఓటర్లు, 80 ఏళ్లు పైబడిన, దివ్యాంగుల ఓట్లు మొత్తం 235 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. ఓట్లు లెక్కించే సమయానికి సర్వీసు ఓటర్ల ఓట్లు అందితే వాటిని కూడా కలిపి లెక్కిస్తారు. నియోజకవర్గంలో మొత్తం 2,15,240 ఓట్లు ఉండగా, 1,47,213 ఓట్లు పోలయ్యాయి.

# అందరికీ అందుబాటులో న్యాయం ఉండాలి: ఉపరాష్ట్రపతి




విశాఖపట్టణం : ప్రజలందరికీ న్యాయాన్ని అందుబాటులోకి, ఆర్థిక భారం కాకుండా చొరవ మరింత పెరగాల్సిన అవసరం ఉన్నదని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కేసుల విచారణలో జాప్యాన్ని తగ్గించడం తక్షణావసరమని ఆయన సూచించారు. మంగళవారం విశాఖపట్టణంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'స్వాతంత్రోద్యమ స్ఫూర్తి : ముందడుగు' థీమ్‌తో నిర్వహించిన 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో న్యాయ వ్యవస్థలో సానుకూలమైన మార్పులు తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా.. భవిష్యత్ న్యాయవాదులైన న్యాయ విద్యార్థులను మార్పునకు సారథులుగా తీర్చిదిద్దాల్సిన అవసరముందని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసుకునే దిశగా ఆలోచన చేయాలన్నారు. స్వాతంత్ర్యానంతరం వివిధ రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ.. గత వైభవాన్ని తలచుకుంటూ వర్తమానంలో ఉండిపోకూడదని, మరింత భవ్యమైన భవిష్యత్‌ను రచించుకునేందుకు పేదరికం, లింగవివక్షత, నిరక్షరాస్యత, కులవివక్ష, అవినీతిని నిర్మూలించేందుకు జాతీయవ్యాప్త ప్రజా ఉద్యమం జరగాల్సిన అవసరం ఉన్నదని ఆకాంక్షించారు. బలమైన, భద్రమైన, సుభిక్షమైన, ఆరోగ్యకరమైన, ఆనందరకమైన భారతదేశ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖామాత్యులు ముత్తంశెట్టి శ్రీనివాస్, విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్యప్రకాష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మధుసూదనరావు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్, చంద్రబాబుకు భయపడే వ్యక్తులు ఇక్కడ ఎవరూ లేరు

- చనిపోయిన పార్టీ మాకు డెడ్ లైన్లు పెట్టడమేంటి
- ఢిల్లీ వెళ్ళి ప్రధాని నరేంద్రమోడీకి పెట్టొచ్చు కదా
- 'జానీ'లు చూపిస్తే భయపడతారేమో చూడమనండి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని



గుడివాడ, నవంబర్ 2 రాష్ట్రంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబుకు భయపడే వ్యక్తులు, శక్తులు ఎవరూ లేరని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు జ్ఞానోదయం కలిగిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నేపథ్యంలో ఉద్యమం చేయడానికి ఇప్పటికైనా ముందుకు వచ్చారని, పవన్ కళ్యాణ్ ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి డెడ్ లైన్లు పెట్టడం కాదన్నారు. చనిపోయిన పార్టీ జనసేన మాకు డెడ్ లైన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఢిల్లీ వెళ్ళి నరేంద్రమోడీకి డెడ్ లైన్లు పెట్టమనండంటూ సలహా ఇచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వారం రోజుల్లో ఆపకపోతే ఏదో ఒకటి చేస్తానంటూ గతంలో నటించిన జానీ వంటి పాత సినిమాలను వాళ్ళకు చూపించాలన్నారు. వాటిని చూసి నరేంద్రమోడీ భయపడతారేమో చూడాలన్నారు. జనసేన చచ్చిపోయిన పార్టీ కాబట్టి పవన్ కళ్యాణ్ డెడ్ లైన్లు పెట్టుకుంటాడన్నారు. అది డెడ్ పార్టీ కదా, రెండు చోట్ల పోటీ చేసి ఆయనే గెలవలేదని అన్నారు. చచ్చిన పార్టీ డెడ్ లైన్లు పెట్టక ఏ లైన్లు పెడుతుందని మంత్రి కొడాలి నాని ఎద్దేవా చేశారు.

## హుజూరాబాద్‌లో భారీ మెజార్టీతో

# ఈటల విజయం

హుజూరాబాద్: ఉపఎన్నికలో బీజేపీ విజయం సాధించింది. టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌పై బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందారు.



దాదాపు అన్ని రౌండ్లలో ఈటల రాజేందర్ ఆధిక్యం కనబర్చారు. 20వ రౌండ్‌లో ఈటల రాజేందర్ 21 వేల 015 ఓట్ల మెజార్టీ సాధించారు. ఈటల రాజేందర్ 2004 నుంచి వరుసగా 7సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక ఈటల రాజేందర్ విజయం సాధించడంతో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్ గన్ పార్క్ వద్ద అమరవీరులకు బీజేపీ నేతలు నివాళులర్పించి స్వీట్స్ పంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ఈటల గెలుపును అడ్డుకోలేకపోయారన్నారు. 2023లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఈ విజయం సంకేతమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి అన్నారు.

# డాక్టర్ దాసరి సుధను అభినందించిన సీఎం జగన్


అమరావతి: బద్వేలు అసెంబ్లీ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన డాక్టర్ దాసరి సుధను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. "బద్వేలు అసెంబ్లీ ఉపఎన్నికలో అఖండ విజయాన్ని అందించిన ప్రతి అక్కచెల్లెమ్మకు, అవ్వాతాతకు, ప్రతి ఆత్మీయ సోదరునికి పేరుపేరునా హృదయపూర్వకంగా



కృతజ్ఞతలు తెలుపుతున్నాను. శాసనసభ్యురాలిగా గెలుపొందిన డా. సుధమ్మకు నా అభినందనలు" అన్నారు సీఎం జగన్. బద్వేలు అసెంబ్లీ ఉపఎన్నికలో అఖండ విజయాన్ని అందించిన ప్రతి అక్కచెల్లెమ్మకు, అవ్వాతాతకు, ప్రతి ఆత్మీయ సోదరునికి పేరుపేరునా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. శాసనసభ్యురాలిగా గెలుపొందిన డా. సుధమ్మకు నా అభినందనలు. 1/2"దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనల వల్లే ఇంతటి ఘన విజయం సాధ్యమైంది. ఈ గెలుపు ప్రజాప్రభుత్వానికి, సుపరిపాలనకు మీరిచ్చిన దీవెనలుగా భావిస్తూ.. మరింత మంచి చేసేందుకు కృషి చేస్తాను" అని సీఎం జగన్ తెలిపారు. దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనల వల్లే ఇంతటి ఘన విజయం సాధ్యమైంది. ఈ గెలుపు ప్రజాప్రభుత్వానికి, సుపరిపాలనకు మీరిచ్చిన దీవెనలుగా భావిస్తూ.. మరింత మంచి చేసేందుకు కృషి చేస్తాను. 2/2బద్వేల్ ఉప ఎన్నికలో భారీ విజయం నేపథ్యంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్‌ని కలిశారు.

## 125 సార్లు అతితీవ్ర స్థాయిలో కురిసిన వర్షాలు..

న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది అత్యధిక స్థాయిలో వర్షపాతం నమోదు అయ్యింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో.. ఈ ఏడాది 125 సార్లు అతిభారీ వర్షాలు కురిసినట్లు భారతీయ వాతావరణశాఖ వెల్లడించింది. గడిచిన అయిదేళ్లలో ఇలాంటి వర్షాలు చోటుచేసుకోవడం రికార్డు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వాతావరణం విపరీతంగా ప్రవర్తించడానికి గల కారణాలను కూడా ఐఎండీ వెల్లడించింది. నైరుతీ రుతుపవనాలు ఆలస్యంగా వెనుదిరగడంతో పాటు సాధారణ పీడనం కన్నా అధిక స్థాయిలో రుతుపవనాలు ఉండడం వల్ల ఇలాంటి వర్ష ఘటనలు చోటుచేసుకున్నట్లు ఐఎండీ చెప్పింది. ఇక నవంబర్‌లో కురవబోయే వర్షాల గురించి కూడా ఐఎండీ ఇవాళ రిపోర్ట్‌ను వెలువరించింది. తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, ఆంధ్ర, యానం, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయి



## పేదలు ఉంటున్న సొంత ఇళ్లపై వన్ టైమ్ సెటిల్మెంట్ పేరుతో జగన్ ప్రభుత్వం వసూళ్లు: కూన రవికుమార్

శ్రీకాకుళం జిల్లా: టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలు నివాసముంటున్న సొంత ఇళ్లపై వన్ టైమ్ సెటిల్మెంట్ పేరుతో జగన్ ప్రభుత్వం వసూళ్లకు సిద్ధమైందన్నారు. రిజిస్ట్రేషన్ల పేరుతో జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం అంటూ, రూ. 4,800 కోట్లను పేదల నుంచి దోచుకుంటోందని ఆరోపించారు. గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.15వేలు, నగరాల్లో రూ.20 వేలు వన్ టైమ్ సెటిల్మెంట్ కింద ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు. 1983 నుంచి 2011 ఆగస్టు వరకు రాష్ట్రంలో వివిధ ప్రభుత్వాల హయాంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లపై, డబ్బులు వసూలు చేసే అధికారం ఈ ముఖ్యమంత్రికి ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు పేదలు తీసుకున్న గృహ రుణాలు రూ.3 లక్షల వరకు మాఫీ చేస్తానని జగన్ హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ ముఖ్యమంత్రికి రాని దిక్కుమాలిన ఆలోచన జగన్మోహన్ రెడ్డికే వచ్చిందని ఎద్దేవా చేశారు. వన్ టైమ్ సెటిల్మెంట్ కింద జగన్ ప్రభుత్వమిచ్చిన జీవోలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కూన రవికుమార్ డిమాండ్ చేశారు. 12 ఏళ్ల పాటు పేదలు నివాసమున్న ఇళ్లు, స్థలాలు వారికే సొంతమవుతాయన్నారు. వాటికి ప్రత్యేకంగా ప్రభుత్వానికి ఎలాంటి కప్పం కట్టాల్సిన పనిలేదన్నారు. ముఖ్యమంత్రి తన అవినీతిని తగ్గించుకుంటే, రాష్ట్రంలోని పేదలకు సొంతిళ్లు నిర్మించడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదని కూన రవికుమార్ అన్నారు.

# సంపాదకీయం

బుధవారం 03 నవంబరు 2021

## విద్యారంగం పై కరోనా తీవ్ర ప్రభావం

దేశంలో విద్యా రంగం ఎంత అధ్వాన్న స్థితిలో ఉందో యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ అద్దంలో స్పష్టంగా చూడొచ్చు. దేశ వ్యాప్తంగా 11 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందులో 69 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పడ్డాయనీ, భారత దేశంలో విద్యాస్థాయిపై విడుదలైన యునెస్కో నివేదిక 2021 వెల్లడించింది. దేశంలో ఒకే టీచర్‌తో నడుస్తున్న పాఠశాలలు లక్ష వరకు ఉన్నట్టు ఈ నివేదిక కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. ఉపాధ్యాయులు లేరు తరగతులూ లేవు' అనే శీర్షిక కింది వెలువడిన ఈ నివేదిక మన దేశంలో విద్యా రంగం గురించి మరెన్నో బాధాకరమైన అంశాలను పూసగుచ్చింది. దేశంలో 18-29 సంవత్సరాల్చొన వారు 22 శాతం ఉన్నారు. అంటే 26 కోట్ల 10 లక్షల మంది. 10-24 వయసులోని యువత 35 కోట్ల 60 లక్షల మంది. సంపద పెంచడానికి అవసరమైన యువత ఇంతగా ఉండగా, వారికి ఆధునిక చదువులు, నైపుణ్యాలు కలిగించలేకపోడం మన పాలకుల వైఫల్యమే. ఐదవ తరగతి చదువుకొంటూ రెండవ తరగతి వాచకం నిర్దుష్టంగా చదవడం చేతగాని విద్యార్థులు దేశంలో అసంఖ్యాకంగా ఉన్నారు. అలాగే 10వ తరగతిలోని విద్యార్థులు 8వ తరగతి లెక్కలు చేయలేకపోడం, వాక్యాలు రాయలేకపోడం వంటి దుర్గతి మన విద్యా రంగాన్ని పీడిస్తున్నది. మొత్తంగా దేశంలో తయారవుతున్న పట్టభద్రుల్లో, సాంకేతిక విద్యోన్నతుల్లో వస్తూత్పత్తికి అవసరమైన తెలివితేటలుండి పరిశ్రమల యజమానులను సంతృప్తి పరచగల నేర్పు, నైపుణ్యాలు గలవారు బహు తక్కువగా ఉండడమే మన విద్యా రంగం చేతగాని తనాన్ని రుజువు చేస్తున్నది. ప్రాక్టికల్స్ కంటే పాఠాలకే ప్రాధాన్యమిచ్చే పనికిరాని విద్యా విధానం మనది అనడం సాహసమనిపించవచ్చు గాని ముమ్మాటికీ వాస్తవం. యునెస్కో నివేదిక ప్రకారం పూర్వ ప్రాథమిక విద్య నేర్పుతున్న ఉపాధ్యాయుల్లో 7.7 శాతం మంది, ప్రాథమిక స్థాయి చదువు చెబుతున్న వారిలో 4.6 శాతం మంది, ప్రాథమికోన్నత టీచర్లలో 3.3 శాతం మంది ఆ స్థాయికి తగిన విద్యార్హతలు లేనివారేనని వెల్లడైంది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులను గత ఏడాది కంటే 6.13 శాతం తగ్గించిన చేదు వాస్తవమే మన పాలకులకు ఆ రంగాన్ని చక్కదిద్దడంపై గల మక్కువ వెల్లడవుతున్నది. విద్య పట్ల కేంద్ర ప్రభుత్వమే ఇంత చిన్నచూపు చూపుతుంటే రాష్ట్రాలు ఇంకెంత తక్కువ ప్రాధాన్యత ఇస్తాయో ఊహించవచ్చు. సర్వశిక్షాఅభియాన్ ప్రాథమిక విద్యా స్థాయిలో బాలికల చదువును మెరుగుపరిచే జాతీయ కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథకం, విద్యా హక్కు చట్టం, బేటీ బచావో, బేటీ పడావో, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, మైనారిటీ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడమే తప్ప అవి దేశంలోని బాలల్లో సాధిస్తున్న విద్యా వికాసం ఎటువంటిదో తెలియదు. దానిని పరిశీలించి తగిన మెరుగుబాటు చర్యలు తీసుకునే వ్యవస్థ దాదాపు లేదనే చెప్పవచ్చు. 2019-20 సంవత్సరంలో సెకండరీ విద్యా స్థాయిలో చదువు మానేసిన వారు (డ్రాపౌట్లు) ఆ తరగతుల్లోని మొత్తం విద్యార్థుల్లో 17 శాతం కాగా, ప్రాథమికోన్నత (68 తరగతులు) స్థాయిలో 1.8 శాతం, ప్రాథమిక స్థాయిలో 1.5 శాతం ఉన్నట్టు వెల్లడైంది. ముందుకు వెళుతున్నకొద్దీ చదువులు మానేస్తున్న వారి శాతం ఎక్కువగా ఉన్నట్టు రూఢి అవుతున్నది. దీనికి ప్రభుత్వం వైపు నుంచి తగిన శ్రద్ధాసక్తులు కొరవడడమే కారణం. దేశంలో పూర్వ ప్రాథమిక నుండి సెకండరీ స్థాయి వరకు 15 లక్షల పాఠశాలలున్నాయి, 97 లక్షల మంది టీచర్లున్నారు. 26.5 కోట్ల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన విద్యా వ్యవస్థ. కాని ఫలితాలు మాత్రం కడుదయనీయం. ఉత్తరాది రాష్ట్రాల్లో విద్యాప్రమాణాలు దారుణంగా పడిపోయాయనే సంగతిని పదేపదే చెప్పుకోనక్కర లేదు. ఉత్తరప్రదేశ్‌లో 3.3 లక్షల టీచర్ పోస్టులు ఖాళీ ఉండగా, బీహార్‌లో 2.21 లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. అలాగే బెంగాల్‌లో 1.1 లక్షల అధ్యాపక ఖాళీలు ఏర్పడ్డాయి. ఇన్నిన్ని లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న దేశంలో విద్య వికసిస్తుందని ఆశించలేము. చదువు బాగుంటే చక్కెర చుట్టూ చేరే చీమల బారుల్లా విద్యార్థులు పాఠశాలలకు ఎగబడుతారు. శిథిలమైపోయి భయపెట్టే గోడలు, పై కప్పులు, విరిగిన తలుపులు, దుర్వాసన చిమ్మే టాయ్‌లెట్లు, అసలు మరుగుదొడ్లే లేని, ఉన్నా స్త్రీలకు ప్రత్యేకంగా ఎటువంటి ఏర్పాటూ లేని పాఠశాలలు దేశంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. ఇలాంటి పాఠశాలలకు విద్యార్థులు ఎందుకు వస్తారు? దేశంలో దాదాపు 90 నుంచి 95 శాతం పాఠశాలలు మౌలిక సదుపాయాల లేమితో బాధపడుతున్నాయని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనిష్ సిసోడియా ఒక సందర్భంలో అన్నారు. దేశంలోని 84.1 శాతం పాఠశాలల్లో గ్రంథాలయాలున్నప్పటికీ అందులో 69.4 శాతం లైబ్రరీల్లో ఒక్క పుస్తకమూ లేదని నిగ్గు తేలింది. ఇటువంటి ఊసర క్షేత్రంలో చదువుల మొలకలు ఎలా పుడతాయి, ఎలా బలపడి మొక్కలై పూలు పూస్తాయి?

# కృష్ణా టీడీపీకి 3 జీ ఫీవర్

విజయవాడ, నవంబర్ 2, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీకి ఇప్పుడు త్రీ "జీ" ల ఫీవర్ పట్టుకుంది. వారిని వచ్చే ఎన్నికలలో ఓడిస్తే చాలు సగం స్థానాలను గెలిచినట్లే. తెలుగుదేశం పార్టీ నేతలందరూ త్రీ "జీ" పైనే చర్చిస్తుండటం విశేషం. తెలుగుదేశం పార్టీ కోస్తాంధ్రలో బలమైన కమ్మ సామాజికవర్గం అండగా ఉంటూ వస్తుంది. అలాంటిది గత ఎన్నికల్లో ఆ సామాజికవర్గం ఓట్లు కూడా తెలుగుదేశం పార్టీ పూర్తి స్థాయిలో సాధించలేకూపోయింది. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్మ సామాజికవర్గం నేతలతోనే పార్టీని టార్గెట్ చేయిస్తుంది. గుడివాడ, గుణదల, గన్నవరం నేతలు టీడీపీకి ఇబ్బందికరంగా మారారు. గుడివాడ నుంచి అంటే కొడాలి నాని ఇప్పటి నుంచి కాదు తొలి నుంచి వైసీపీ వైపే ఉన్నారు. ఆయన వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు, లోకేష్ లను టార్గెట్ చేసేవారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ను ప్రశంసిస్తూనే నారా వారి కుటుంబాన్ని నడిరోడ్డుపై బట్టలూడదీయాలని పిలుపునిచ్చేవారు. కొడాలి నాని టీడీపీకి గత కొన్నేళ్లుగా కొరకరాని కొయ్యగా మారారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి విజయం సాధించారు. తర్వాత వైసీపీకి మద్దతుదారుగా మారిపోయారు. పార్టీని వీడుతూ చంద్రబాబు, లోకేష్ ను వీధిన పడేశారు. లోకేష్ వల్లనే తాను పార్టీని వీడినట్లు వల్లభనేని వంశీ చెప్పారు. దమ్ముంటే తనపై లోకేష్ పోటీ చేయాలని, తాను రాజీనామాకు సిద్ధమని వల్లభనేని వంశీ సవాల్ విసిరారు. దీంతో వచ్చే ఎన్నికల్లో గన్నవరంలో వల్లభనేని వంశీని ఎలాగైనా ఓడించాలని టీడీపీ నేతలు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. దీంతో పాటు విజయవాడ గుణదలకు చెందిన దేవినేని అవినాష్. దేవినేని అవినాష్ 2019 ఎన్నికల వరకూ టీడీపీలోనే ఉన్నారు. రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడిగా పనిచేశారు. మొన్నటి ఎన్నికల్లో గుడివాడ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీలో చేరిపోయారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిపింది దేవినేని అవినాష్ అనుచరులేనని టీడీపీ నేతలు చెబుతున్నారు. దీంతో గుణదల, గన్నవరం, గుడివాడ వైసీపీ నేతలు టీడీపీకి తలనొప్పిగా మారింది. చంద్రబాబు కూడా దీక్ష విరమణ సందర్భంగా ఈ ముగ్గురికి పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు.

# అనంతపురంలో తమ్ముళ్ల విభేదాలు

అనంతపురం, నవంబర్ 2, (న్యూస్ పల్స్)టీ కొట్లు.. రచ్చబండల మీద జరిగే చర్చలు యమ రంజుగా ఉంటాయి. రాజకీయాలపై చాలా ఆసక్తిగా చర్చలు అక్కడ జరుగుతుంటాయి. ఒక మాజీ మంత్రిపై ఆ నియోజకవర్గంలో అలాంటి చర్చే నడుస్తోందట. చర్చకు కారణం ఆయనపై వచ్చిన ఒక కరపత్రం. ఆ కరపత్రాల టాక్స్ టీకొట్ల వరకు ఆగితే ఓకే.. పార్టీ అధినేత వరకు వెళ్తే ఏంటన్నదే ప్రశ్నగా మారింది. ఆ కథేంటో ఇప్పుడు చూద్దాం..!గతంలో అనంతపురం జిల్లా టీడీపీలో ఎంతో క్రమశిక్షణ కనిపించేది. ఇప్పుడంతా వర్గ విబేధాలు.. గొడవలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులుపైనా విమర్శలు, ఆరోపణలు తప్పడం లేదు. జిల్లా టీడీపీలో కాల్వ కీలకం. చంద్రబాబు నమ్మే వ్యక్తుల్లో ఆయన ఒకరు. ఇప్పుడు ఆయన చుట్టూనే విమర్శలు తిరుగుతున్నాయి. తాజాగా శింగనమల నియోజకవర్గం మొత్తం ఈ మాజీ మంత్రి పేరే వినిపిస్తోంది. కాల్వపై ఒక కరపత్రం శింగనమల నియోజకవర్గంలో చక్కర్లు కొడుతోంది. ఆ కరపత్రంలో మాజీ మంత్రి పేరు ప్రస్తావిస్తూనే శింగనమలలో టూమెన్ కమిటీ.. టీడీపీ ఇంఛార్జ్ బండారు శ్రావణి మధ్య ఉన్న వర్గ విబేధాలలోకి లాగారు. శింగనమల ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం. ఇక్కడ పార్టీ ఇంఛార్జ్ బండారు శ్రావణిని కాదని.. అగ్రవర్ణాలకు చెందిన నాయకులతో టూమెన్ కమిటీని వేసింది టీడీపీ అధిష్ఠానం. ఆ టూమెన్ కమిటీ కర్త కర్మ క్రియ అన్నీ కాల్వ శ్రీనివాసులే అని ఆ కరపత్రంలో ఆరోపించారు. ఇప్పటికే శ్రావణి వర్గీయులు టూమెన్ కమిటీని వ్యతిరేకిస్తూ జిల్లా టీడీపీ ఆఫీస్‌లో కాల్వతో గొడవపడ్డారు. తరచూ రోడ్డెక్కుతున్నారు స్థానిక నాయకులు. ప్రస్తుతం శింగనమల నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఈ కరపత్రాలే కనిపిస్తున్నాయి. అందులోని అంశాలపై ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. అయితే ఈ కరపత్రాలు రావడానికి కారణం మీరంటే మీరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో శింగనమలలో టీడీపీ ఓటమికి కారణాలంటూ కొన్ని అంశాలను ఆ కరపత్రంలో ప్రస్తావించారు. గడిచిన రెండేళ్లుగా ఎలాంటి

కార్యక్రమం చేపట్టని వారిని కమిటీలో వేశారని విమర్శించారు. దళితులకు అన్యాయం చేస్తున్నారని.. అణగదొక్కుతున్నారని.. దానికి వ్యతిరేకంగా దళిత నాయకుల యునైటెడ్ ఫ్రంట్, ఏపీ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం.. ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పేర్లతో ఉద్యమానికి సిద్ధమన్న సంకేతాలు సూచించేలా ఆ కరపత్రం ఉంది. ఇన్నాళ్లూ ఎటువంటి విభేదాలు లేకుండా ఉన్న కాల్వ తనదికాని నియోజకవర్గం విషయంలో చిక్కుకుని వివాదాస్పదం అయ్యారు. ఒక సామాజికవర్గం అంతా కాల్వను టార్గెట్ చేసింది. అది ఎక్కడ తన నియోజకవర్గంలో తన కొంపముంచుతుందనే ఆందోళనతోపాటు.. అధినేతకు ఆ కరపత్రం చేరితే వచ్చే సమస్యలు ఏంటో అర్థంకాక తల పట్టుకున్నారట కాల్వ.

# మాయమవుతున్న చెరువులు

విశాఖపట్టణం, నవంబర్ 2, (న్యూస్ పల్స్)గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, నగర జీవికి సేద తీర్చేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెరువులు ఎంతగానో దోహదం చేస్తాయి. ఒక ఊర్లో చెరువులు, వాటి నీటి సామర్థ్యాన్ని బట్టి ఆ గ్రామ ప్రజల ఆర్థిక పరిస్థితులను ఇట్టే చెప్పేయవచ్చు. చెరువుల్లో నీరుంటే జనం నోటి కాడికి కూడు వెళ్తాది. కాని నేడు అంతటా చెరువులు మాయమైపోయే పరిస్థితి దాపురించింది. జన సంచారాలు పెరిగిపోవడం, ప్రజల జీవన విధానం, పరిశ్రమల కాలుష్యం, చెరువులను పరిరక్షించే ప్రభుత్వ పటిష్ట విధానం లేకపోవడం వెరసి చెరువులు కనిపించకుండా పోతున్నాయి. ఒకవేళ ఉన్నా వాటిలో జల కళ ఉండడం లేదు. వాటి సామర్థ్యం ఏనాడో కునారిల్లిపోయింది. విశాఖ జిల్లా, చుట్టుపక్కల పరిసరాల్లో చెరువులు 150 వరకూ నీటి సామర్థ్యాన్ని కోల్పోయాయని ఏపి రాష్ట్ర ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్‌కు విశాఖకు చెందిన మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ తాజాగా లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో పాడైపోయి, వాటి నిర్దిష్టమైన సామర్థ్యాన్ని కోల్పోయిన చెరువులపై నివేదిక ఇవ్వాలంటూ ఆ రాష్ట్ర హైకోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఏపిలోనూ ఇదే పరిస్థితి ఉందని తక్షణం ఇరిగేషన్, గ్రామ, వార్డు స్థాయి ప్రభుత్వ సిబ్బంది ద్వారా సర్వే జరిపి చెరువుల పరిస్థితిపై నివేదిక రూపొందించకపోతే భవిష్యత్ తరాలకు తాగడానికి సైతం నీరుండదని ఇఎఎస్ శర్మ ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని రావికమతం మండలం మైనర్ ఇరిగేషన్ రిజర్వాయర్ కల్యాణలోవ 5వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే సామర్థ్యం ఉండేది. అక్రమ మైనింగ్‌తో క్యాచ్‌మెంట్ ఏరియా పడిపోయి పలు గ్రామాలకు సాగు, తాగు నీరందే అవకాశాలు పడిపోయాయని ఇఎఎస్ శర్మ తన లేఖలో పేర్కొన్నారు. అధికారులు కళ్లున్నా కబోదుల్లా వ్యవహరిస్తూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారంటూ ఆయన ఎద్దేవా చేస్తున్నారు. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి నెలకొందని, తక్షణమే సర్వే చేపట్టడం ద్వారా చెరువులను రక్షించుకోవాలని సూచిస్తున్నారు. నగరంలోని ముడసర్లోవ చెరువును బాగు చేసిన దాఖలా లేనందున సిల్ట్ అధికమై దాని నీటి సామర్థ్యం పడిపోయింది. పక్కనేగల పైనాపిల్ కాలనీకి చెందిన వ్యర్థాలన్నీ ఈ నీటిలో కలుస్తుండడం, అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ మట్టిని తీసి ఈ చెరువులో పడేయడంతో చెత్తా, చెదారాలతో ముడసర్లోవ పూర్తిగా పేరుకుపోయింది. విశాఖలో పరిశ్రమల కాలుష్యం వల్ల కూడా పలు చెరువులు కలుషితమై చెరువుల్లో నీరున్నా అవి తాగితే ప్రమాదకర పరిస్థితులు నెలకొనే స్థాయికి వెళ్లిపోయాయి. ఈ విధంగా 150 చెరువుల వరకూ సామర్థ్యంను కోల్పోయినట్లు ఇఎఎస్ శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. దశాబ్దాలుగా నగర జీవనం విస్తరించడంతో చెరువులను కప్పేసి ప్లాట్‌లు వేయడం, ఆక్రమించడం వంటి కార్యకలాపాలు విశాఖలో నానాటికీ పెరిగిపోయాయి. సింహాచలం కొండలపై నుంచి 7 వనరుల ద్వారా ముడసర్లోవలోకి నీరు వచ్చి చేరేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. క్యాచ్‌మెంట్ ఏరియా పూర్తిగా పడిపోయింది. జివిఎంసి చేసే పనులతో ముడసర్లోవలోకి పైన తెలిపినట్లు 'గార్బేజీ డంపింగ్' కూడా చెరువులను చంపేస్తుంది. విజయనగరం జిల్లాలోని ఓ పరిశ్రమ నీటిని ట్రీట్‌మెంట్ చేయకుండా వదిలేయడం వల్ల విశాఖలోని మేఘాద్రిగెడ్డకు టాక్సిక్ కాలుష్య కారకాలు రావడంతో మేఘాద్రిగెడ్డ నీరు కూడా కలుషితమై సామర్థ్యం అధ:పాతాళానికి నెట్టబడింది. భీమిలి కేంద్రంలోని పెద్దచెరువును రియల్ ఎస్టేట్ కుబేరులు తమ గుప్పెటకు తీసుకోవడంతో నీటి లభ్యత, సామర్థ్యం పడిపోయినట్లు ఇరిగేషన్ అధికారులే స్వయంగా చెబుతున్నారు. పరవాడ మండలంలోని పరవాడ, తానాం గ్రామాల మధ్య గల ఊరచెరువు ఫార్మా సిటీ వ్యర్థ జలాల వల్ల కలుషితమై దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నీరు పంట పొలాలకు పనికి రాకపోవడంతో ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో విశాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చెరువులను రక్షించేందుకు సర్వే జరపాలంటూ ఏపి ప్రభుత్వాన్ని ఇఎఎస్ శర్మ తన లేఖలో కోరారు.

# పవన్ డోలాయమానం

విజయవాడ, నవంబర్ 2, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఇటు బీజేపీ కావాలి. అటు టీడీపీ కావాలి. రెండు పార్టీలతో పయనించాలన్నదే ఆయన ప్రయత్నంగా కన్పిస్తుంది. ఇటీవల విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం దీనికి అద్దం పడుతుంది. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ ఒక్క మాట బీజేపీని అనలేదు. అదే సమయంలో టీడీపీ ప్రస్తావన తేలేదు. పవన్ కల్యాణ్ ఇప్పటికే వరసగా పొత్తులు మార్చుకుంటూ వెళుతున్నారు. ఇది ఆయన క్రెడిబులిటీని ప్రశ్నిస్తుంది. రాజకీయాల్లో స్థిరత్వం లేని నేతగా పవన్ కల్యాణ్ ఇప్పటికే ముద్రపడ్డారు. మరోసారి పార్టీలను మార్చే ఉద్దేశ్యం ఆయనకు లేదనిపిస్తుంది. 2019 ఎన్నికల తర్వాత ఎవరి వత్తిడి లేకుండానే పవన్ కల్యాణ్ బేషరతుగా బీజేపీతో పొత్తుకు సిద్ధమయ్యారు.

2019 ఎన్నికలకు ముందు బీజేపీని ఎండగట్టిన పవన్ కల్యాణ? వెనువెంటనే మనసు మార్చుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. మరోసారి పవన్ కల్యాణ్ పొత్తుకు సిద్ధమవుతున్నారు. అయితే ఈసారి బీజేపీని వీడటం పవన్ కు సుతారమూ ఇష్టంలేదు. దాని వల్ల రాజకీయంగా ఉపయోగం ఉండకపోగా, ఎన్నికల ముందు ఐటీ వంటి దాడులు జరుగుతాయన్న అనుమానాలు ఆయనలో లేకపోలేదు. అందుకే బీజేపీతో కలసి నడవడానికే ఆయన ఇష్టపడుతున్నారు. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ మద్దతు కూడా పవన్ కల్యాణ్ కు అవసరం. అందుకే బీజేపీ పెద్దలను ఒప్పించి ఎలాగైనా టీడీపీతో జట్టుకట్టే ప్రయత్నం పవన్ కల్యాణ? చేస్తారన్నది పొలిటికల్ సర్కిళ్లలో నడుస్తున్న టాక్. అందుకోసమే విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో వైసీపీనే దోషిగా నిలబట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో బీజేపీని, టీడీపీపై ఒక్క కామెంట్ కూడా చేయలేదు. దీంతో పవన్ కల్యాణ్ రెండు పార్టీలతో కలసి నడుద్దామన్న నిర్ణయంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. మరి పవన్ కల్యాణ్ ప్రయత్నాలకు బీజేపీ పెద్దలు ఏమాత్రం సహకరిస్తారన్నది చూడాల్సి ఉంది.

# వివాదాలకు కేరాఫ్ అడ్రస్

ఏలూరు, నవంబర్ 2, (న్యూస్ పల్స్)రఘురామ కృష్ణరాజుకు తన సొంత నియోజకవర్గంలో వ్యతరేకత తీవ్రంగా కన్పిస్తుంది. అధికార పార్టీలో ఉండి ఆ పార్టీపై తిరుగుబాటు చేయడం సొంత సామాజికవర్గం నేతలకే నచ్చడం లేదు. గతంలో ఎవరూ వ్యవహరించని తీరులో రఘురామ కృష్ణరాజు వ్యవహరిస్తుండటాన్ని తప్పుపడుతున్నారు. క్షత్రియ సామాజికవర్గం పరువు తీస్తున్నారంటున్నారు. సమస్యను మరింత సాగదీస్తూ తనకు తానే నష్టం చేసుకుంటున్నారన్న కామెంట్స్ నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. నరసాపురం పార్లమెంటు స్థానానికి ఇప్పటికే అనేక పార్టీల నుంచి అనేక మంది ప్రాతినిధ్యం వహించారు. ఎక్కువగా క్షత్రియ సామాజికవర్గం వారే ఎంపీలుగా పనిచేశారు. వీరిలో ఎవరూ ఇలా వీధిన పడింది లేదు. పైగా పార్టీ అగ్రనేతల మన్ననలను పొంది మంచి పదవులను దక్కించుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కానీ రఘురామ కృష్ణరాజు మాత్రం ఎవరి మాయలో పడి సమస్యను మరింత జటిలం చేసుకుంటున్నారంటున్నారు. కనుమూరి బాపిరాజు ఇక్కడి నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. ఆయన వైఎస్ రాజశేఖర్ రెడ్డి వంటి వారితో సన్నిహిత సంబంధాలు నెరిపారు. అరుదుగా దక్కే తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవిని పొందగలిగారు. ఇక్కడి నుంచి భూపిరాజు విజయ్ కుమార్ రాజు మూడుసార్లు ఎంపీగా తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచారు. కానీ ఆయన ఎలాంటి వివాదాల జోలికి పోలేదు. గోకరాజు గంగరాజు కూడా బీజేపీ ఎంపీగా పనిచేసి మన్ననలను అందుకున్నారు. కానీ రఘురామ కృష్ణరాజు మాత్రం గెలిచిన మరుసటి రోజు నుంచే వివాదాలకు కేంద్రంగా మారారు. ముఖ్యమంత్రి జగన్ తో వ్యక్తిగత వైరాన్ని పెంచుకున్నారు. సహజంగా క్షత్రియులంటే హుందాగా వ్యవహరిస్తారు. కానీ రఘురామ కృష్ణరాజు మాత్రం రోజూ మీడియా సమావేశాలు పెట్టి చిల్లర గా మారారన్న వ్యాఖ్యలు ఆ సామాజికవర్గం నుంచే వినిపిస్తున్నాయి. మొత్తం మీద రఘురామ కృష్ణరాజును ఇటు వైసీపీ, అటు సొంత సామాజికవర్గం లైట్ గా తీసుకుంది. ఇప్పుడు ఆయన గురించి పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు. తొలినాళ్లలో ఆయనకు ప్రయారిటీ ఇచ్చిన టీడీపీ అనుకూల మీడియా కూడా ఇప్పుడు వదిలేసింది.

# ఇసుక లభ్యత మరింత దుర్లభం



కడప, నవంబర్ 2, (న్యూస్ పల్స్)కడప జిల్లాలో ఇసుక లభ్యత దుర్లభంగా మారింది. జిల్లాలోని నదీ ప్రవాహాలన్నింట్లో నిండుగా నీటి ప్రవాహాలు కొనసాగుతుండడమే కారణమని తెలుస్తోంది. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యకలాపాలకు ఇసుక సమృద్ధిగా లభిస్తేనే జిల్లా అభివృద్ధి పరుగులు తీసేది. కానీ నదీమ తల్లులు తమ గర్భాల నుంచి నీటి ప్రవాహాలను నింపుకోవడంతో ఇసుక తీయడానికి దుర్లభంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లావ్యాప్తంగా లక్షన్నర క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక డిమాండ్ ఉన్న నేపథ్యంలో 33 వేల క్యూబిక్ మీటర్లకు పడిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలో వినియోగదారులకు అడిగిన వెంటనే ఇసుకను సరఫరా చేయడం కష్టంగా మారినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇసుక లభ్యత బంగారాన్ని తలపిస్తోంది. గతేడాది జిల్లాలో 12 నుంచి 16 ఇసుక రీచ్‌ల్లో ఇసుక లభించేది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నమోదైన అధిక వర్షాల కారణంగా ఇసుక రీచ్‌ల్లో పెన్నా, కుందూ, చెయ్యేరు తదితర నదుల్లో నీటి ప్రవాహాల గలగలల ధాటికి ఇసుక లభ్యత దుర్లభంగా మారింది. ఇటువంటి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కిచ్చమాంబపురం-4, కుమారునిపల్లి, పి.అనంతపురం ఇసుకరీచ్‌ల పరిధిలోని పట్టా భూముల్లో ఇసుక లభ్యమవుతోంది. జిల్లాలో ఇసుక డిమాండ్ ఊపందుకోవడంతో కిచ్చమాంబపురం-2, కొండూరు-2, కొండూరు-3 ఇసుక రీచ్‌లను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో 61,0198 క్యూబిక్‌మీటర్లు మాత్రమే ఇసుక లభ్యమవుతోంది. ఇందులో నదీప్రవాహాల ధాటికి 33,0651 వేల క్యూబిక్ మీటర్లు మాత్రమే లభ్యమవుతోంది. లభ్యత, సరఫరా మధ్య తేడా 27,954 క్యూబిక్‌మీటర్ల మేర వ్యత్యాసం కనిపిస్తోంది. ఇటువంటి ఇసుక కొరత పరిస్థితుల నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసిన అనంతరం 10 రోజుల వరకు ఇసుక సరఫరా కావ డం లేదనే విమర్శలు జోరందుకున్నాయి. ఈనెల ఐదున కొత్త ఇసుక పాలసీ రానున్న నేపథ్యంలో అధికారులు సైతం ఏమీ చేయలేక ఎదురు చూ డాల్సిన దుస్థితి దాపురించింది. కొత్త ఇసుక పాలసీలో మైనింగ్‌శాఖకు ప్రాధాన్యత లభించనుందా, లేక ఇసుక కార్పొరేషన్‌కు బాధ్యతలు అప్పగి స్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. కొత్త పాలసీ అనంతరం మైనింగ్, ఇసుక కార్పొరేషన్‌ల మధ్య స్పష్టమైన వైఖరి వెల్లడైన అనంతరం ఇసుక లభ్యత, కొరతలపై సీరియస్‌గా దృష్టి సారించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై శాండ్ ఆఫీసర్‌ను వివరణ కోరగా జిల్లాలోని ప్రధాన నదుల్లో నీటి ప్రవాహాలు పెరగడంతో ఇసుక లభ్యత కష్టంగా మారింది. దీంతో పట్టాభూములు కలిగిన ఇసుకరీచ్‌ల్లోని ఇసుకను సరఫరా చేయాల్సి వస్తోందని పేర్కొనడం గమనార్హం.

# ప్రేమ విఫలం అవడంతో ప్రేమికుడు వింత సందేశం

రాజమండ్రి నవంబర్ 2, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో యువకుడు ప్రేమ విఫలం అవడంతో తన ప్రేమించిన అమ్మాయి కి క్షమాపణ చెప్పడానికి ఈ యువకుడు కొత్త దారిని ఎంచుకున్నాడు. దాదాపూ రాజమహేంద్రవరంలో తన ప్రేమించిన అమ్మాయి ఇంటి వద్ద నుంచి ఎక్కడెక్కడికి తిరుగుతుందో తిరిగే చోట్ల సారీ నేను నిన్ను మోసం చేయలేదు అంటూ ఫ్లెక్సీలు అంటించాడు. దీంతో ఇప్పుడు రాజమహేంద్రవరంలో ఆ ఫ్లెక్సీలు హాట్ టాపిక్ గా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక అమ్మాయికి అబ్బాయి క్షమాపణ చెప్పాలి అంటే.. ఇలా కూడా చెప్తారా అనేది రాజముండ్రి యువత ఇప్పుడు కొత్తగా ఆలోచిస్తున్నారు. ఈ ప్రేమికుడు చేసిన ఈ వింత విన్యాసాన్ని ఆ ప్రేమికురాలు అర్థం చేసుకొని కలిసి ముందుకు వెళ్తారని మరికొంతమంది ప్రేమికుల ఆశిస్తున్నారు

# బాబుది వ్యూహాత్మక మౌనమేనా

విజయవాడ, నవంబర్ 2, (న్యూస్ పల్స్)డీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎప్పటికీ మారేలా లేరు. ఆయన ఇంకా మల్లెల బాబ్జి కాలంనాటి రాజకీయాల్లోనే ఉన్నారు. మల్లెల బాబ్జీతో ఎన్టీఆర్ పై దాడి చేయించి రాజకీయ లబ్ది పొందినట్టు ఇప్పుడు కూడా తన సొంత మనుషులతో చెత్త పనులు చేయించి, సానుభూతి పొంది తద్వారా రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు దేవస్థానాలపై దాడులు జరిగాయి. అలాగే కొన్ని చోట్ల దేవుళ్ళ విగ్రహాలపై, దేవాలయాల నిర్మాణాలపై, దేవతల బొమ్మలపై దాడులు జరిగాయని టీడీపీ నాయకత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. అయితే వివిధ ప్రాంతాల్లో టీడీపీ నాయకుల ప్రమేయం వెలుగులోకి రావడంతో ఆ తర్వాత దేవాలయాలపై దాడులు ఒక్కసారిగా ఆగిపోయాయి.రాజమండ్రిలో టీడీపీ నేతల హస్తం బయటపడిన వెంటనే తేలుకుట్టిన దొంగల్లా టీడీపీ నేతలు మౌనం దాల్చారు. అలాగే అక్రమ ఇసుక, అక్రమ మద్యం వంటి కార్యక్రమాల్లో పలువురు టీడీపీ నేతలు, సానుభూతిపరుల ప్రమేయం ఎప్పటికప్పుడు కనిపిస్తూనే ఉంది. ఇటీవల కాలంలో సినిమా రంగం నుండి తీసుకొచ్చిన పెయిడ్ ఆర్టిస్టులతో వీడియోలు చేసి రాష్ట్ర ప్రభుత్వం వరదల నివారణలో విఫలం అయిందని చెప్పి అడ్డంగా దొరికిపోయారు. అబద్దాల వీడియోలు చేసిన పెయిడ్ ఆర్టిస్టులు దొరికిపోయారు. అప్పట్లో మల్లెల బాబ్జీ తో ఆడించిన డ్రామా లాగే ఈ పెయిడ్ ఆర్టిస్టులతో డ్రామా చేసి అభాసుపాలయ్యారు చంద్రబాబు. అయినా ఎదురు దాడి చేస్తూనే రాజకీయ లబ్దికోసం టీడీపీ నేతలు, చంద్రబాబు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.విజయవాడలో కాల్ మని ? సెక్స్ రాకెట్ లో దొరికిన వాళ్ళంతా టీడీపీ నేతలే అనేది అప్పట్లోనే బహిరంగం అయింది. ఈ విషయం అప్పట్లోనే ప్రజలు అర్ధం చేసుకున్నారు. ఇసుక దొంగతనం క్రమంలో ఒక మహిళా ఎమ్మార్వోను కూడా జుట్టుపట్టి లాగి కింద పడేసిన సందర్భంలోనే ఇసుక మాఫియా టీడీపీ కనుసన్నల్లోనే ఉందనే విషయం ప్రజలకు తెలిసిపోయింది. అయినా ఇప్పటికీ ఇసుక మాఫియా అంటూ ప్రత్యర్థులపై దాడి చేయడం చంద్రబాబుకు ఆయన అనుచరులకు అలవాటయింది. ఇప్పుడు గంజాయి వ్యాపారం అంటూ కొత్తగా మొదలు పెట్టిన ఎదురు దాడి సందర్భంగా చంద్రబాబు వెంట ఉన్నదెవరు అని ఆలోచిస్తే ఇంతకు ముందు ఒకటి రెండు సందర్భాల్లో గంజాయి కేసుల్లో ఇరుక్కున్న వ్యక్తులే అని తేలి పోయింది.గుంటూరు జిల్లా చుండూరు గ్రామంలో గంజాయి కేసులు, రౌడీ షీట్ ఉన్న బాలాకోటిరెడ్డి అనే వ్యక్తి నిన్న ముఖ్యమంత్రిపై తీవ్రస్థాయిలో బూతులు మాట్లాడాడు. ఇలాంటి వాళ్ళను పక్కన పెట్టుకుని చంద్రబాబు మళ్ళీ మల్లెల బాబ్జీ కాలం నాటి రాజకీయాలు చేసి లబ్ధిపొందాలని చూస్తున్నారు. పార్టీ లో ఇప్పుడు అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తూ నిత్యం మీడియాలో కనిపిస్తున్న కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పూర్వాశ్రమంలో లాడ్జి నడిపిస్తూ చిన్న స్థాయిలో వ్యభిచారం నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి. ఇంతటి గొప్ప వ్యక్తి 2019 వరకూ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు.పార్టీ ఓడిపోగానే చంద్రబాబుకు ఇలాంటి వ్యక్తుల అవసరం వచ్చింది. వాళ్ళతోనే రాజకీయం నడిపిస్తున్నాడు. ఈ వ్యక్తులు ఇంత నేలబారు వాళ్ళు కావడం వల్లనే వాళ్ళ నోటినుండి బోస్ డీకే, పాలేరు వంటి పదాలతో ముఖ్యమంత్రిని, డీజీపీని దూషించగలుగుతారు. అయితే చంద్రబాబు తెలుసుకోవాల్సిందేమంటే ఇలాంటి నేలబారు వ్యక్తులతో, ఇలాంటి కుట్రలతో ఎల్లకాలం చీకటి రాజకీయాలు నడపలేము అని. ఈ విషయం తెలుసుకున్న రోజున చంద్రబాబు ఈ రాష్ట్రంలో రాజకీయాలు నడపలేరు.

## నెల్లూరు ఏంటీ... దాని లెక్కేంటీ

నెల్లూరు, నవంబర్ 2, (న్యూస్ పల్స్)నెల్లూరు కార్పొరేషన్ కు ఈ నెల 15వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. సహజంగా అధికార వైసీపీకి ఇక్కడ అనుకూల వాతావరణమే ఉంటుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నెల్లూరు జిల్లాలో క్లీన్ స్వీప్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటింది. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలు కూడా వైసీపీకి ప్రతిష్టాత్మకమే. ఇక్కడ జనసేన, టీడీపీ, బీజేపీ సయితం బలంగా ఉండటంతో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారనుందినెల్లూరు కార్పొరేషన్ లో 54 డివిజన్లు ఉన్నాయి. మేయర్ పదవిని చేపట్టాలంటే 28 డివిజన్లను గెలుచుకోవాల్సి ఉంటుంది. నెల్లూరు టౌన్, నెల్లూరు రూరల్ శాసనసభ నియోజకవర్గాలు ఇందులో కలసి ఉన్నాయి. మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇక్కడ నెల్లూరు కార్పొరేషన్ బాధ్యతలను చూసుకోవాల్సి ఉంటుంది. అయితే నెల్లూరు వైసీ?పీలో గ్రూపుల గోల ఎక్కువగా ఉండటం పార్టీని ఇబ్బంది పెట్టే అవకాశముందంటున్నారు.నెల్లూరు జిల్లాలో పది ఎమ్మెల్యే స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఇందులో దాదాపు ఆరుగురు ఎమ్మెల్యేలకు నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో పట్టుంది. మేకపాటి, ఆనం, ఆదాల, నల్లపురెడ్డి, కాకాణి కుటుంబాలు సయితం ఇక్కడ ప్రభావం చూపుతాయి. అయితే ఇప్పటి వరకూ అనేక గ్రూపులుగా ఉన్నాయి. మంత్రి అనిల్ కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఒక గ్రూపుగా ఉండగా, కాకాణి వేరు కుంపటి పెట్టారు. వీరి పార్టీ కార్యాలయానికి కూడా రావడం మానేశారు.జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషించనున్నారు. కాకాణి, ఆనం, అనిల్ కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి లు అభ్యర్థుల ఎంపికలో తమ వర్గానికి కావాలని పట్టుబట్టే అవకాశముంది. ఇప్పుడు వైసీపీకి గెలుపు సంగతి ఎలా ఉన్నా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారనుంది. హైకమాండ్ అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన పరిస్థితులు అయితే నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో నెలకొన్నాయని చెప్పకతప్పదు.

## గంటా... రాజకీయ సన్యాసమేనా

విశాఖపట్టణం,నవంబర్ 2, (న్యూస్ పల్స్)సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో ఉన్నట్లా? లేనట్లా? ఒకరకంగా పార్టీలో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నట్లే. మరోరకంగా ఆయనను పార్టీ దూరం పెట్టినట్లే అనుకోవాలి. గంటా శ్రీనివాసరావును ఇప్పుడు చంద్రబాబు దూరం పెట్టారు. ఇది నిజం. ఇలాంటి నేతలు పార్టీకి అవసరం లేదని చంద్రబాబు భావిస్తున్నారు. పార్టీ నాయకత్వం అంటే లెక్కలేని తనం లేనివాళ్లను ఉపేక్షించేది లేదని చంద్రబాబు ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు.గంటా శ్రీనివాసరావు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికలలో గెలుపొందారు. అతి తక్కువ ఓట్లతో ఆయన విజయం సాధించారు. టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో అప్పటి నుంచి ఆయన నియోజకవర్గానికి దూరంగానే ఉంటున్నారు. తన మేనల్లుడిని నియోజకవర్గానికి ఇన్ ఛార్జిగా నియమించి పూర్తిగా రాజకీయాలకు దూరమయ్యారనే చెప్పాలి. ఆయన పై తరచూ పార్టీ మారతారన్న ప్రచారం జరుగుతోంది. దానికి ఆయన కాదని చెప్పరు. అవునని చెప్పరు. దీంతో ఆయన టీడీపీలో ఉంటారా? లేదా? అన్న సస్పెన్స్ కొనసాగుతుంది.కాగా చంద్రబాబు గత కొద్దికాలంగా గంటా శ్రీనివాసరావు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వదిలేయడంపై చంద్రబాబు గంటాపై అసహనంతో ఉన్నారు. ఆయన పార్టీలో లేకపోయినా పరవాలేదు అన్న నిర్ణయానికి వచ్చారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై వైసీపీ నేతలు జరిపిన దాడిని గంటా శ్రీనివాసరావు ఖండించారు.కానీ గంటా శ్రీనివాసరావు చంద్రబాబు దీక్షకు మద్దతుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి రాలేదు. ఆయన పార్టీ కార్యాలయానికి వచ్చి ఏడాదిన్నర పైగానే అవుతుంది. పీఏసీ ఛైర్మన్ గా పయ్యావుల కేశవ్ పేరు ప్రకటించనంత వరకూ ఆ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. ఆ పదవి దక్కకపోవడంతో అప్పటి నుంచి ఆయన రాజకీయంగా సైలెంట్ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ మౌనాన్ని ఆశ్రయిస్తున్నారు. గంటా పూర్తిగా పార్టీని వదలేశారని భావించిన చంద్రబాబు ఆయనను పక్కన పెట్టాలని నిర్ణయించారు.



# జోరు వానలోనూ టిడిపి కార్పొరేషన్ ఎన్నికల ప్రచార జోరు



నెల్లూరు నవంబర్ 2, (న్యూస్ పల్స్) నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 13 వ డివిజన్ లో జోరు వానలోనూ టీడీపీ ప్రచారం జోరుగా సాగింది. స్థానిక డివిజన్ టీడీపీ అభ్యర్థి కాయల తిరుపతి మంగళవారం చింతా రెడ్డిపాలెం, వెలమవారి దిన్నే, బడి తోట పరిసర ప్రాంతాలలో గడపగడపకు తిరుగుతూ ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఓటర్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు . ఈ సందర్భంగా టిడిపి అభ్యర్థి తిరుపతి మాట్లాడుతూ తనకు కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన టిడిపి నాయకులకు, స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నెల 15న జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు వేసి కల్పించవలసిందిగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ పేనేటి దేవదాసు మాట్లాడుతూ 1995లో స్థానిక డివిజన్ కార్పొరేటర్గా విజయం సాధించడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల రీత్యా ప్రజలు తమ విలువైన ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సంక్షేమానికి సహకరించగల అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. గత 2 రోజురోజుకి పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలు, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు అదుపులోకి రావాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పేనేటి దేవదాస్, స్థానిక నాయకులు కంకర మస్తాన్, ప్రశాంత్, దానం మహేష్, ఈదురు రాంబాబు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి టీడీపీ సిద్ధం

నెల్లూరు నవంబర్ 2, (న్యూస్ పల్స్)నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీ సిద్ధంగా ఉందని, ఈ తరుణంలో వైసీపీ చేపడుతున్న దురా గతాలను ఎదుర్కొంటామని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే చినరాజప్ప స్పష్టం చేశారు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం అల్లీపురంలోని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి నివాసంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం డబ్బు పంచి బెదిరింపులు, దుశ్చర్యలకు పాల్పడుతూ ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. ఆపార్టీ అనుసరిస్తున్న విధానాలు సరైనవి కావన్నారు. సోమిరెడ్డి చంద్రమోహ న్రెడ్డి మాట్లాడుతూ వైకాపా అధికా రంలోకి వచ్చి రెండన్నరేళ్లయినా.. వారు చేసిన అభివృద్ధి చెప్పి ఓట్లు అడిగే పరిస్థితి లేదన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కేసులు పెట్టిస్తా మని ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను బెదిరించడం దారుణమన్నారు. తెదేపా ప్రభుత్వ హయంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామ న్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ ను మత్తు పానీయాల రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దుదాం

**రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ ఛైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి**

**నంద్యాల పార్లమెంట్ సభ్యుడు పోచ బ్రహ్మానందరెడ్డి**

నంద్యాల నవంబర్ 2నంద్యాల రెవెన్యూ డివిజన్ నుంచి మత్తు పానీయాల దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమాలు . ఆంధ్ర ప్రదేశ్ ను మత్తు పానీయాల రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దుదాం.అని రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి.నంద్యాల పార్లమెంట్ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు.మంగళవారం రామకృష్ణ డిగ్రి కళాశాల ఆడిటోరియంలో మత్తు పానీయాల నిర్మూలనపై కళాజాత కార్యక్రమాలను నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి.రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి.నంద్యాల పార్లమెంట్ సభ్యుడు పోచ బ్రహ్మానందరెడ్డి. కళాశాల అధినేత జి రామకృష్ణ రెడ్డి.ప్రారంభించారు.మత్తు పానీయాల నిర్మూలనపై కళాజాత కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ. ఎక్సైజ్ శాఖ సీఐ కృష్ణ కుమార్. భారత జ్ఞాన విజ్ఞాన సమితి డైరెక్టర్ సాయి కృష్ణపాల్గొన్నారు.అనంతరం రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి. మాట్లాడుతూమద్య విమోచన ప్రచార కమిటీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీన కర్నూల్ లోని టిజివి కల్యాణ మండపంలో మత్తు పానీయాల పై కళాజాత ప్రారంభించడం జరిగిందన్నారు. 2 వ తేది న నంద్యాల రామకృష్ణ డిగ్రి కళాశాల ఆడిటోరియంలో జరిగిందన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల విద్యార్థుల మంచి భవిష్యత్తు నాశనం కావడం, కుటుంబాలు వీధిన పడడం, హత్యలు మానభంగాలు వంటి అనేక ఘోరాలు జరుగుతున్నాయన్నారు. కావున యువత, విద్యార్థులను మత్తుపానీయాలకు గురికాకుండా కళాజాత కార్యక్రమాల ద్వారా నవంబర్ 1 నుండి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలలో డిగ్రీ,ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటి ప్రాంగణాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులలో గంజాయి పంట సాగు చేస్తున్న 4500 ఎకరాల్లో ఆంధ్ర ఒరిస్సా పోలీసులు గంజాయి పంటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు ఇందుకు స్థానిక ప్రజలు సహకరించాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గంజాయి,డ్రగ్స్,అక్రమ రవాణా మద్యం,నాటుసారా,గుట్కా ల పై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ మంచి కార్యక్రమాల వల్ల మద్యం వినియోగం 40 శాతం,బీరు వినియోగం 70 శాతం తగ్గిందన్నారు.మద్యం అక్రమాలపై 14500 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు చేపడతామన్నారు. రంగం ప్రజానాట్య మండలి రాజేష్ వారి కళా రూపంలో ను మరియు మియ్య గారి గజిల్ ద్వార మద్యం సేవించడం వలన జరిగే అపార నష్టాన్ని గురించి.ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి కళ రూపాల ప్రదర్శనలు ప్రదర్శించారు ఈ ప్రదర్శనలు విద్యార్థుల ఆకట్టుకున్నాయి.పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమాలపైరాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి కర్నూలు జిల్లా నుంచి కళాజాత కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. మద్యం వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని మద్యం నివారించేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టాలన్నారు.రాష్ట్రంలోని 13 జిల్లాలలో మత్తుపదార్థాల నిషేధంపై కళాజాత కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో శుభపరిణామమన్నారు.. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పాఠశాలల ఎన్ సి సి మరియు విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాత ప్రభుత్వ భవనాలను పరిశీలించిన ఎమ్మెల్య ఆనం

నెల్లూరు నవంబర్ 2, (న్యూస్ పల్స్) నెల్లూర్ జిల్లా రాపురు మండలంలోని పాత భవనాలను ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. తరువాత అయన కలెక్టర్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో ముఖ్యంగా రెండు చోట్ల పాత భవనాలు ఉన్నాయి. ముందుగా వెంకటగిరిలో తహసీల్దార్ కార్యాలయం ఉంది. రాపురు లో తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ ఆఫీసు, ట్రెజరీ ఉన్నాయి. వాటిని కొత్త భవనాలుగా తీర్చిదిద్దాలని అలాగే రాపూరు లో ఉన్న తాసిల్దార్ కార్యాలయం ఉన్న చోటులోనే కొత్త భవనం నిర్మించాలని అన్నారు. పోలీస్ స్టేషన్, మండల్ ఆఫీస్ అన్నీ ఒకే చోట ఉండటం వల్ల ఈ తాసిల్దార్ కార్యాలయం కూడా ఇక్కడే కొత్త భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సి ఐ నాగ మల్లేశ్వరరావు, ఎంపీడీవో మహేష్ బాబు, ఎస్ ఐ కాంతి కుమార్ పట్టాభిరామిరెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల రహదారుకు మరమ్మతులను చేపట్టాలి

**రాహుల్ సాగర్**

ఎమ్మిగనూరు నవంబర్ 2, (న్యూస్ పల్స్)మండల పరిధిలో గ్రామీణ ప్రాంతాల రహదారుకు మరమ్మతులను చేపట్టాలని డిమాండ్ చేసిన జనసేన పార్టీ మండల అధికార ప్రతినిధి రాహుల్ సాగర్, ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ సాగర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండల పరిధిలో ఉన్న గ్రామాల రహదారులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులు స్పందించి వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు మండలం లో ఉండే అనేక గ్రామాల్లో రహదారులు గుంతల మయంగా మారాయని ఇలా మారడం వల్ల రహదారులో ప్రయాణించే వాహనదారులు గ్రామవాసులు తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారని జాతీయ రహదారులకు ఆనుకొని ఉన్న గ్రామాల దగ్గర ఈ సమస్య తీవ్రంగా ఉందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి త్వరలోనే రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠా ఆరెస్టు

అనంతపురం నవంబర్ 2, ఎర్రచందనాన్ని అక్రమంగా విదేశాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటోన్న అంతర్జాతీయ స్మగ్లర్ల ముఠాను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు.వారి నుంచి 3,305 కిలోల ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇవి సుమారు కోటి రూపాయలకు పైగానే విలువ చేస్తాయని పోలీసులు చెబుతున్నారు.ఈ ముఠాలోని ఇద్దరు కీలక నిందితులు విదేశాల్లో ఉంటూ ఈ అక్రమ వ్యాపారానికి తెరతీశారు. ఇందుకోసం తమిళనాడుకు చెందిన కొందరు ఎర్రచందనం కూలీల సహాయం తీసుకున్నారు. వైఎస్సార్ కడప, చిత్తూరు అడవుల నుంచి దొంగలించిన ఎర్రచందనాన్ని ముందుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి శ్రీలంకకు..ఆపై సముద్ర మార్గంలో చైనా తదితర విదేశాలకు రవాణా చేస్తున్నారు.ఈ మేరకు ఎర్రచందనం అక్రమ రవాణా గురించి అనంతపురం పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో చిలమత్తూరు మండలం కొడికొండ వద్ద రెడ్ హ్యాండెడ్గా ఎర్రచందనం స్మగ్లర్ల ముఠాను పట్టుకున్నారు. మొత్తం 19 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 3,305 కిలోల ఎర్ర చందనం, 5వాహనాలు, 19 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకు న్నారు. నిందితుల వద్ద దొరికిన ఎర్రచందనం విలువ రూ.కోటికి పైగానే విలువ చేస్తోందని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం పట్టుబడ్డ వారిలో 8మంది తమిళనాడు ముఠా సభ్యులు కూడా ఉన్నారని వారు పేర్కొన్నారు.

## భక్తిభావాన్ని పంచిన బాలకాండ అఖండ పారాయణం

తిరుమల, నవంబర్ 02, ప్రపంచంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం జరిగిన మూడోవిడత బాలకాండ అఖండ పారాయణం భక్తిభావాన్ని పంచింది. నాదనీరాజనం వేదికపై ఉదయం 6 నుండి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. బాలకాండలోని 8 నుండి 13 సర్గల వరకు గల 163 శ్లోకాలను ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆధ్యాపకులు ఆచార్య ప్రవా రామక్రిష్ణ సోమయాజులు, ఇతర పండితులు పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రవా రామక్రిష్ణ మాట్లాడుతూ మధురమైన రామనామస్మరణ ఫలాన్ని శ్రీ వాల్మీకి మహర్షి, శ్రీ త్యాగరాజస్వామి, శ్రీ తులసీదాసు లాంటి మహనీయులు ఆస్వాదించి, మనందరికీ అదేమార్గాన్ని చూపారని చెప్పారు. ఆచార్య స్థానంలో ఉన్న హనుమంతుడు మనకు మంచి చెడులు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. శ్రీరాముని అవతారమైన శ్రీనివాసుని సన్నిధిలో రామాయణ పారాయణం మనందరి పూర్వజన్మ సుకృతమన్నారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యాయన సంస్థకు చెందిన వేద పారాయణ దారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంకు చెందిన శాస్త్రీయ పండితులు పాల్గొన్నారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు శ్రీమతి వందన బృందం " రామ కోదండరామ రామ కల్యాణరామా... ", అనే సంకీర్తనను కార్యక్రమం ప్రారంభంలో, " రామ రామ రామ రామ ... రామనామ తారకం ......." అనే సంకీర్తనను కార్యక్రమం ముగింపులో సుమధురంగా అలపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మురళీధర శర్మ, టిటిడి వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, శ్రీవారి ఆలయ ఒఎస్డి పాల శేషాద్రి పాల్గొన్నారు.

## కుదేలయిన బీజేపీ, కాంగ్రెస్ లు

కడపనవంబర్ 2, (న్యూస్ పల్స్) కడప జిల్లా బద్వేల్ ఉప ఎన్నికలో వైసీపీ భారీ విజయం సాధించింది. వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధా భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. బద్వేల్లో వైసీపీ అభ్యర్థి సుధ 90,089 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. వైసీపీకి మొత్తం 1 లక్షా 11 వేల 710 ఓట్లు రాగా, బీజేపీకి 21 వేల 612 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ కు 6 వేల 205 ఓట్లు వచ్చాయి. నోటాకు 3 వేల 635 ఓట్లు వచ్చాయి. దీంతో 90 వేల 089 ఓట్ల తేడాతో వైసీపీ విజయం సాధించింది. బద్వేల్లో మొత్తం 1 లక్షా 46 వేల 546 ఓట్లు పోలయ్యాయి. మొదటి రౌండ్ నుంచే వైకాపా తన ఆధిక్యం చాటింది. ఒక రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు ఘోర పరాజయాన్ని చవిచూడాల్సివచ్చింది. బీజేపికి 20 వేల పైచిలుకువచ్చింది. కాంగ్రెస్ కు దారుణంగా ఆరువేల ఓట్ల రావడం, ఆ పార్టీ నేతలకు మింగుడుపడలేదు. బద్వేల్ నియోజకవర్గంలో ఆ రెండు పార్టీలకు ఓటు బ్యాంకు అంతంతమాత్రమే. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్కు అక్షరాల 2వేల 148 ఓట్లు పోలయ్యాయి.ఈసారి బీజేపీకి దగ్గరగా.. కాంగ్రెస్ కంటే ఎక్కువగా నోటాకు 3 వేల 31 ఓట్లు పోలవడంవిచిత్రం. పరిస్థితికి అద్దం పడుతోంది. తాము భారీగానే ఓట్లు కొల్లగొడతామని భావించిన కాంగ్రెస్ నేతల అంచనాలు తలకిందులయ్యాయి. సంప్రదాయాలను గౌరవించి పోటీనుంచి తప్పుకుంటే కాంగ్రెస్ పార్టీ గౌరవం నిలబడేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



# పాల సేకరణ పెంచాలి

ఏలూరు, నవంబర్ 02, బి యం సి యు లు ,డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణాలు వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బి యం సి యు లు , డిజిటల్ లైబ్రరీ లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, పెన్షన్ల పంపిణీ , జగనన్న తోడు , అమూల్ ప్రాజెక్టు , జలజీవన్ మిషన్, ఉపాధి హామీ, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది హాజరు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి యం సి యు లు, డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతంగా జరగాలన్నారు. జగనన్న తోడు ,ఉన్నతి పథకాలకు సంబంధించి రికవరి పెరగాలన్నారు. అమూల్ ప్రాజెక్టు లో పాలసేకరణ పెంచాలన్నారు. జలజీవన్ మిషన్ క్రింద పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. పనులవారిగా ,కాంట్రాక్టర్ వారి గా సమీక్షించాలన్నారు.ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ నిర్దేశించిన మండలాల్లో పూర్తి చేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ దశలో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ ,వార్డు సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ 95 శాతం పైగా నమోదు కావాలన్నారు.

# ప్రశాంత వాతావరణంలో నెల్లూరు కార్పొరేషన్, బుచ్చి ఎన్నికలు... కలెక్టర్ వెల్లడి

నెల్లూరు నవంబర్ 2,( విభారె) నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ తో పాటూ బుచ్చి మున్సిపాల్టీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు తెలియజేశారు. ఎన్నికలకు ఇవాళ నోటిఫికేషన్ విడుదలైన నేపధ్యంలో నెల్లూరు నగరంతో పాటూ బుచ్చి మున్సిపాల్టీలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకొచ్చిందన్నారు. నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఈనెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 8వ తేదీనా ఉప సంహరణ, అదే రోజు తుది జాబితా విడుదల చేస్తామని తెలియజేశారు. 15వ తేదీనా పోలింగ్ , 17వ తేదీనా ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాలను ప్రకటిస్తామని కలెక్టర్ తెలియజేశారు. బ్యాలెట్ బాక్సుల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని ప్రకటించారు. నెల్లూరు కార్పొరేషన్ లో 54 డివిజన్లకు గానూ 450 పోలింగ్ కేంద్రాలు, బుచ్చి మున్సిపాల్టీలో 20 వార్డులకు గానూ 38 పోలింగ్ కే?ంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు మేయర్ స్థానం ఎస్సీ జనరల్ కు, బుచ్చి మున్సిపల్ ఛైర్మన్ స్థానం బిసి మహిళకు రిజర్వ్ చేయబడిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇవి కాకుండా జిల్లాలో 7 మండలాల్లోని 7 ఎంపిటిసీ స్థానాలకు, రెండు సర్పంచ్ స్థానాలకు, 37 వార్డు సభ్యుల స్థానాలకు కూడా ఈనెల 14న ఎన్నికలు జరుగుతాయని కలెక్టర్ చక్రధర్ బాబు ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ హరెంధిర ప్రసాద్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ విజయరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ఎ ఐ ఎఫ్ డీఎస్ డిమాండ్

బెల్లంపల్లి నవంబర్ 02( విభారె) విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎ ఐ ఎఫ్ డీఎస్ డిమాండ్ చేశారు.అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య( ఏఐఎఫ్డీఎస్) రాష్ట్ర కమిటి పిలుపు మేరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం సూపర్ డెంట్ కు వినతిపత్రం అందజేసిన జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్. వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది,సంక్షేమ గురుకులాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సరిపడా సీట్లు కేటాయించాలని,పెండింగులో ఉన్న స్కాలర్షిప్,ఫీజ్ రియంబర్స్ మెంట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి, శిధిలావస్థలో ఉన్న,అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు,కళాశాలలకు పక్క భవనాలను నిర్మించి సరైన మౌలిక వసతులు కల్పించాలని,ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసి బోధనేతర సిబ్బందిని తక్షణమే భర్తీ చేయాలి,రెగ్యులర్ ఏంఈ ఓ లను వెంటనే నియమించాలి, కార్పొరేట్,ప్రైవేట్ విద్యా సంస్థలలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి జీవో నెంబర్ 46 ను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రింట్డ ఎలక్ట్రానిక్ జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్,ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్యను అందించాలని,యూనివర్సిటీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, యూనివర్సిటీలకు అధిక నిధులు మంజూరు చేయాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు లెక్చరర్లను పర్మినెంట్ చేయాలి,కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్యను వెంటనే అమలు చేయాలని,కరోనా కాలంలో లో ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకొని ఉపాధి కల్పించాలని, రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ విద్యా సంస్థల మూసివేతను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్ లను వెంటనే నియమించాలని కోరారు, రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలు, బార్ల మీద చూపిస్తున్న శ్రద్ధ,ప్రభుత్వ పాఠశాలపై చూపించాలి అని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయికులు కొండ శ్రీనివాస్,సతీష్,సన్నీ,రోహిత్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి స్థానికాలయాల్లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి నవంబర్ 02( విభారె),లతిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ ఆలయాల్లో నవంబరు 4వ తేదీన దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. భక్తులను ఉదయం 11 గంటల నుండి దర్శనానికి అనుమతించారు. శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఉదయం 7 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## మంత్రాలయం నియోజకవర్గం టిడిపి ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి

కౌతాళం నవంబర్ 02( విభారె) మంత్రాలయం నియోజకవర్గం లో కౌతాళం మండలం కోసిగి మండలం లోని నదితీర ప్రాంతంలో మొన్న కురిసిన వర్షము తో వరి, మిరుప, పత్తి ,పంటలు దెబ్బ తిన్నాయి. కాబట్టి ఆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి అని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి పేర్కొన్నారు. రైతులు నష్టపోయిన కనీసం వైయస్సార్ ప్రభుత్వం పట్టించుకోకుండా కనీసం ఆ రైతులను పరామర్శించకుండా నిర్లక్ష్యము చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావున నష్టపోయిన రైతులను ఆదుకోవాలి అని అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి అని వారు అన్నారు.

# శీతాకాలంలో పెరిగే అద్భుతమైన పూల మొక్కలు, వాటి వివరాలు..




శీతాకాలం సూర్యుడు తక్కువ సమయం ఉంటూ, ఎండ కూడా స్వల్పంగా ఉంటుంది. క్రమంగా చల్లని ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటూ, క్లిష్టమైన వాతావరణం నెలకొంటుంది. దీని మూలంగా జీవన విధానాలలో కూడా స్తబ్ధత మొదలవుతుంది. అంతేకాకుండా, శీతాకాలంలో అనేకరకాల పుష్ప జాతుల మొక్కలు ఆకులను వదిలివేసి, నిద్రావస్థకు చేరుకుంటూ ఉంటాయి. క్రమంగా వాటికి పూలు పూయడం కూడా కష్టతరంగా ఉంటుంది. కానీ, ఈ సంవత్సరంలో ఇటువంటి చల్లటి నెలల్లో కూడా వృద్ధి చెందుతున్న కొన్ని పుష్ప జాతులు ఉన్నాయి.కాలానుగుణంగా పుష్పించే మొక్కలు రంగు మరియు పరిమాణంలో మారుతూ ఉంటాయి. అవి మీ తోటలో కూడా తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తాయి. మీకు మొక్కల పట్ల మక్కువ ఎక్కువగా ఉన్న పక్షంలో, ఈ శీతాకాలంలో కూడా మీరు పూలు పొందగలిగే కొన్ని పుష్ప జాతుల మొక్కల జాబితాను ఇక్కడ చూడండి.కాలెంన్డ్యులా..కాలెంన్డ్యులా..కాలెంన్డ్యులా, సాధారణంగా దీనిని "పాట్ మారీ గోల్డ్" అని వ్యవహరించడం జరుగుతుంది. . కుండలు మరియు ప్లాంటర్స్ లో బాగా పెరుగుతాయి. ఇవి అత్యంత సాధారణమైన శీతాకాలపు పువ్వులుగా ఉంటాయి. వీటిని జాగ్రత్తగా నిర్వహించడం కూడా సులభం. పసుపు నుండి లోతైన నారింజ వరకు వివిధ రంగులలో ఈ పూలు పూస్తుంటాయి.వింటర్ జాస్మిన్..'వింటర్ జాస్మిన్..ఈ శీతాకాలంలో మీ తోటకి అందాన్నివ్వడానికి "వింటర్ జాస్మిన్" రకం మొక్క ఒక అద్భుతమైన ఎంపికగా చెప్పబడుతుంది. వీటి నిర్వహణా వ్యయం, మరియు శ్రమ కూడా తక్కువగా ఉంటుంది. ఇది ప్రకాశవంతమైన పసుపు రంగు పువ్వులను ఉత్పత్తి చేస్తుంది. మరియు అవి జనవరి ప్రారంభంలోనే వికసిస్తుంటాయి.పాన్సీ..పాన్సీ..మరో సాధారణ శీతాకాలపు పువ్వుగా పాన్సీ ఉంటుంది. ఇది దాదాపు అన్ని రంగుల షేడ్స్ లో లభిస్తుంది. విభిన్న రంగుల కలయికను ఉపయోగించి మీరు మీ తోటలో వాటిని పెంచుకోవచ్చు. పాన్సీలు తక్కువగా పెరిగే మొక్కలు కావున ఇవి నీడలో బాగా వృద్ధి చెందుతాయి. పెటునియా..పెటునియా..మీ శీతాకాలపు తోటను ప్రకాశవంతం చేయడానికి పెటునియాస్ కూడా మంచి ఎంపికగా సూచించబడుతుంది. ఈ శీతాకాలంలో 'గ్రాండి ఫ్లోరా' రకం పెటునియాని ఎంపిక చేసుకోవడం ఉత్తమం. అవి పెద్ద పరిమాణంలో పువ్వులను కలిగి ఉంటాయి. శరదృతువు మరియు శీతాకాలంలో నాటడానికి అనువైన మొక్కలుగా సూచించబడుతాయి. పెటునియాస్ తెలుపు, పసుపు, గులాబీ, ముదురు క్రిమ్సన్ మరియు నలుపు, ఊదా వంటి అనేక షేడ్స్‌లో వస్తాయి.ఇంగ్లీష్ ప్రింరోస్..ఇంగ్లీష్ ప్రింరోస్..ఈ పువ్వులు, శీతాకాలంలో మీ తోటను అందంగా ఉంచేందుకు సూచించదగిన మరొక ఉత్తమ ఎంపికగా ఉంటుంది. అవి తెలుపు, పసుపు, నారింజ నుండి నీలం, గులాబీ మరియు ఊదా రంగు వరకు దాదాపు అన్నిరకాల రంగులో పూస్తుంటాయి. ఇంగ్లీష్ ప్రింరోస్ శీతాకాలం మధ్యకాలం నుండి వికసిస్తుంది. హెలెబోర్. హెలెబోర్..ఈ మొక్కకు ఒక ప్రత్యేకమైన వ్యవస్థ ఉంటుంది. దీనిలో వేర్లు లోతుగా పెరుగుతూ రూట్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. హెలెబోర్స్ చల్లని ఉష్ణోగ్రతను తట్టుకోగలవు. సాధారణంగా ఇవి తెలుపు, గులాబీ మరియు ఊదా వంటి రంగులలో కనిపిస్తాయి. ఈ పువ్వులు పెరుగుతున్నప్పుడు క్రిందికి వ్రేలాడుతూ ఉంటాయి, అందుకే వాటిని ఎత్తుగా ఉన్న కుండీలలో పెంచవలసి ఉ ంటుంది.కామెల్లియాస్.ామెల్లియాస్..తాకాలంలో కామెల్లియాస్ ఆశ్చర్యకరంగా అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకోగల పుష్ప జాతిగా ఉంటుంది. అవి చల్లని గాలులు వీచినంత కాలం ఈ పుష్పాలు వికసిస్తుంటాయి. ఈ మొక్కలు మీ తోటలోని ఇతర మొక్కలతో సరిపోయేలా కూడా ఉంటాయి. టర్ హనీసకిలవింటర్ హనీసకిల్..వింటర్ హనీసకిల్ పువ్వులు నవంబర్ నుండి ఏప్రిల్ వరకు వికసిస్తాయి. ఈ మొక్క క్రీమీ వైట్ పువ్వులను ఉత్పత్తి చేస్తుంది. ఇది నిమ్మకాయను పోలి ఉండే సువాసనను విడుదల చేస్తుంది, ఇది మీ నిస్తేజమైన శీతాకాలపు వాతావరణాన్ని ఆసక్తికరంగా చేస్తుంది. ఫ్లోక్స్.. ఫ్లోక్స్..శీతాకాలంలో పెరిగే మరొక పుష్ప జాతి మొక్క ఫ్లోక్స్. విస్తృత శ్రేణి రంగులతో, ఇది మీ తోటకి అద్భుతమైన ప్రదర్శనను అందిస్తుంది. స్వీట్ అలిసమ్. స్వీట్ అలిసమ్..ఈ పువ్వులు తేలికపాటి మంచును తట్టుకోగలవు. అవి దృడంగా ఉన్నందున, వాటిని శీతాకాలం అంతా ఎటువంటి సంకోచం లేకుండాపెంచవచ్చు. ఇవి చూసేందుకు చిన్నవిగా ఉన్నా కూడా, సూక్ష్మమైన తీపి సువాసనను కలిగి ఉంటాయి : ఈఃస్వీట్-పీ(బఠానీ)ీ.వ్ట్-పీ(బఠానీ)..స్వీట్ బఠానీ మొక్కలకు నిర్వహణ కూడా తక్కువగానే ఉంటుంది. చల్లని శీతాకాలంలో అవి సులభంగా పెరుగుతాయి. ఈ స్వీట్-పీ మొక్క నీలం, గులాబీ, తెలుపు నుండి పీచు, బర్గండి మరియు మెజెంటా రంగులలో విస్తృతంగా పువ్వులను ఉత్పత్తి చేస్తుంది. స్నోడ్రోప్స్..స్నోడ్రోప్స్..అందమైన, క్రిందికి తిరిగిన తెల్లటి రేకులతో విరబూసే ఈ స్నోడ్రోప్స్ మీ శీతాకాలపు తోటకు సూచించదగిన సరైన పుష్ప జాతి మొక్కలుగా ఉంటాయి. ఈ పువ్వులు నవంబర్ ప్రారంభంలో వికసిన్తా, అవి ఫిబ్రవరి వరకు పెరుగుతాయి. శీతాకాలంలో పువ్వులను పెంచడానికి సూచించదగిన చిట్కాలు..తాకాలంలో పువ్వులను పెంచడానికి సూచించదగిన చిట్కాలు..1. మీ తోటలోని స్థలం ప్రకారమే మొక్కలను నాటండి. 2. శీతాకాలంలో మీ మొక్కలకు జాగ్రత్తగా నీరు పోయాలని గుర్తుంచుకోండి. 3. క్రమం తప్పకుండా కంపోస్ట్ అనుసరించండి. 4. కంటైనర్లలో మొక్కలను పెంచుతున్నట్లయితే, కంటైనర్‌లో తగినంత పారుదల ఉండాలని గుర్తుంచుకోండి. ఈ వ్యాసం మీకు నచ్చినట్లయితే మీ ప్రియమైన వారితో పంచుకోండి. ఇటువంటి అనేక ఆసక్తికర ఆరోగ్య, మాతృత్వ, శిశు సంక్షేమ, జీవన శైలి, ఆహార, లైంగిక, వ్యాయామ, ఆధ్యాత్మిక, జ్యోతిష్య, హస్త సాముద్రిక, తదితర సంబంధిత విషయాల కోసం బోల్డ్ స్కై పేజీని తరచూ సందర్శించండి. ఈ వ్యాసంపై మీ అభిప్రాయాలను, వ్యాఖ్యలను క్రింద వ్యాఖ్యల విభాగంలో తెలియజేయండి.

# పుట్టింది చంపడానికి! రణవీర్ ఫిలాసఫీయే వేరు!!



బార్న్ టు కిల్ .. బిల్ట్ టు లాస్ట్..!! రణవీర్ బిగ్ ఫైట్ కి రెడీ అవుతున్నట్టే కనిపిస్తోంది. లైఫ్ జర్నీలో ఎలాంటి పోరాటానికైనా తనని తాను సిద్ధంగా ఉంచుకున్నప్పుడే ఎలాంటి స్ట్రగుల్ ని అయినా అధిగమించగలమనేది రణవీర్ సింగ్ ఫిలాసఫీ. బాలీవుడ్ లో ఆరంభమే పాము - నిచ్చెనల ఆటలో రాటు దేలిన ఈ యువ ప్రతిభావంతుడు .. అక్కడ కంచె వేసిన ఆ నలుగురి మెప్పు పొందాడు. ఆ క్రమంలోనే తన ఆటకు ఎదురే లేకుండా తెలివిగా పావులు కదిపాడు.సుశాంత్ సింగ్ రాజ్ పుత్ లాంటి ప్రతిభావంతుడు ముక్కు సూటిగా వెళ్లి కెరీర్ ని నాశనం చేసుకుంటే .. గాలి వాటుగా రణవీర్ ఎత్తుగడలతో ఎదిగాడని చెబుతుంటారు. ఏదేమైనా కానీ .. బార్న్ టు కిల్.. బిల్ట్ టు లాస్ట్. ఇప్పుడున్న సంఘంలో ఇలాంటి ఒక ఫార్ములా లేకపోతే ముందుకు వెళ్లడం అసాధ్యం అని అతడు చెబుతున్నట్టే అనిపిస్తోంది. ఇటీవల తాను నటించిన 83 లాంటి సినిమా రిలీజ్ కి రావడం లేదు. క్రైసిస్ వల్ల అంతకంతకు ఆలస్యమైంది. ఈ చిత్రానికి తన భార్య దీపిక పదుకొనే ఒక పెట్టుబడి దారు. ఇక 83 చిత్రాన్ని పాన్ ఇండియా కేటగిరీలో విడుదల చేసేందుకు సన్నాహకాల్లో ఉన్నారు నిర్మాతలు. డిసెంబర్ 24న ఈ సినిమా క్రిస్మస్ కానుకగా విడుదలవుతోంది. త్వరలోనే ప్రమోషన్స్ ని ప్రారంభించనున్నారు. తాజాగా రణవీర్ సింగ్ జిమ్ లో తీవ్రంగా శ్రమిస్తున్న ఫోటోలను షేర్ చేసి దానికి బార్న్ టు కిల్ .. బిల్ట్ టు లాస్ట్ ! అనే ట్యాగ్ లైన్ ని జోడించారు. అతడు జిమ్ లో ఎంతగా చెమటోడుస్తున్నాడో ఈ ఫోటోల బంచ్ చూస్తే అర్థమవుతోంది. ఫిట్నెస్ పరంగా రాజీ అన్నదే లేకుండా రణవీర్ శ్రమిస్తున్నాడనడానికి ఈ ఫోటోలే సాక్ష్యం. ఇక నిరంతరం తీవ్రమైన పోటీ ఉండే బాలీవుడ్ లో హీరోలంతా ఎంతగా శ్రమిస్తారో చూస్తున్నదే. ఇక రణవీర్ తనదైన ఎనర్జీతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. రణవీర్ నటించిన జయేష్ భాయ్ జోర్ధార్.. రాఖీ ఔర్ రాణీ కి ప్రేమ్ కహానీ.. సిర్కస్ చిత్రీకరణల్లో ఉన్నాయి. త్వరలో ఇవన్నీ రిలీజ్ కి రావాల్సి ఉంది.

# 'గుడ్ లక్ సఖి' రెడీ.. ఒకే నెలలో రెండు సినిమాలతో వస్తున్న మహానటి..!

జాతీయ ఉత్తమ నటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో రూపొందిన లేడీ ఓరియెంటెడ్ మూవీ "గుడ్ లక్ సఖి". స్పోర్ట్స్ డ్రామా బ్యాక్ డ్రాప్ వస్తున్న ఈ సినిమాలో కీర్తి రైఫిల్ షూటర్ గా నటించింది. ఇందులో ఆది పినిశెట్టి మేల్ లీడ్ పోషించగా.. జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. అయితే ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడటంతో సఖిని విడుదలకు సిద్ధం చేస్తున్నారు.'గుడ్ లక్ సఖి' చిత్రాన్ని నవంబరు 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు చిత్ర బృందం సోమవారం ప్రకటించింది. ఈ మేరకు కీర్తి - ఆది పినిశెట్టి - జగపతిబాబు ఉన్న ఓ పోస్టర్ ని విడుదల చేసింది. ఈ సినిమాతో పాటుగా కీర్తి సురేష్ నటించిన 'పెద్దన్న' మూవీ కూడా నవంబర్ లోనే విడుదల అవుతోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ సినిమా దీపావళి కానుకగా నవంబర్ 4న థియేట్రికల్ రిలీజ్ కాబోతోంది. ఇందులో రజినీ సోదరిగా కీర్తి కనిపించనుంది. ఇలా మహానటి నటించిన రెండు సినిమాలు నవంబర్ లోనే సందడి చేయనున్నాయి.కాగా 'లక్ష్మి' 'ధనిక్' వంటి చిత్రాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న విలక్షణ దర్శకుడు నగేష్ కుకునూర్ "గుడ్ లక్ సఖి" సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెడుతున్నారు. ఓ గ్రామీణ యువతి అంతర్జాతీయ షూటర్ గా ఎలా మారిందనే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దిల్ రాజ్ సమర్పణలో 'వర్త్ ఏ షాట్ మోషన్ ఆర్ట్స్ ప్రొడక్షన్' బ్యానర్ పై సుధీర్ చంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రావ్యా వర్మ దీనికి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు.రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. చిరంతాన్ దాస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'గుడ్ లక్ సఖి' ప్రచార చిత్రాలు - టీజర్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు ఎక్కువ మంది మహిళలు వర్క్ చేయడం విశేషం. తెలుగు తమిళ మలయాళ భాషల్లో రూపొందిన "గుడ్ లక్ సఖి" ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.




# మన 'పుష్ప' కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పుష్ప సినిమా చిత్రీకరణ ముగింపు దశకు వచ్చింది. డిసెంబర్ 17న విడుదల కాబోతున్న పుష్ప సినిమా కోసం తెలుగు ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఉన్నారు. ఇక మలయాళంలో కూడా బన్నీకి మంచి ఫాలోయింగ్ ఉంది కనుక అక్కడ కూడా ఈ సినిమా కోసం జనాలు ఎంతో ఇంట్రెస్ట్ గా వెయిట్ చేయడం చాలా కామన్ విషయం. కాని పుష్ప కోసం దేశ వ్యాప్తంగా సినీ అభిమానులు వెయిట్ చేస్తున్నారు. పుష్ప ఎప్పుడెప్పుడు వస్తుందా అంటూ.. చూడ్డం కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని ప్రేక్షకులు చెబుతున్నారు. ప్రముఖ టికెట్ బుకింగ్ పోర్టల్ బుక్ మై షో వారు ఎక్కువ ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాలు ఏంటీ అంటూ పోల్ పెట్టిన సమయంలో టాప్ 10 లో మన పుష్ప కు చోటు దక్కింది. బాలీవుడ్ లో పలు భారీ సినిమాలు రూపొందుతున్నాయి. ఇలాంటి సమయంలో పుష్ప సినిమా టాప్ 10 లో చోటు దక్కించుకోవడం అనేది మామూలు విషయం కాదు. బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్ కుమార్ హీరోగా నటించిన సూర్యవంశీ సినిమాను ఎక్కువ మంది చూసేందుకు ఎదురు చూస్తున్నామంటూ నెం.1 స్థానంలో నిలిపారు. ఇక మలయాళంలో రూపొందుతున్న మోహన్ లాల్ మరక్క సినిమా రెండవ స్థానంలో నిలిచినట్లుగా బుక్ మై షో పోర్టల్ లో పేర్కొన్నారు. అల్లు అర్జున్ పుష్ప సినిమా ఈ జాబితాలో ఆరవ స్థానంలో నిలిచింది. పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కాబోతున్న పుష్ప సినిమా కోసం ఉత్తరాది ప్రేక్షకులు కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లుగా దీంతో అర్థం అయ్యింది. సుకుమార్ గత చిత్రం రంగస్థలం మరియు అల్లు అర్జున్ గత చిత్రం అల వైకుంఠపురంలో సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. కనుక వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఈ సినిమా కూడా ఖచ్చితంగా బాక్సాఫీస్ ను షేక్ చేసే విధంగా ఉ ంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. రికార్డుల వర్షం కురియడం మాత్రమే కాకుండా ఉత్తరాదిన అల్లు అర్జున్ ఓ రేంజ్ లో కుమ్మేసేలా పుష్ప ఉ ంటుందని అంటున్నారు. ఇప్పటి వరకు అల్లు అర్జున్ నటించిన సినిమాలు హిందీలో డబ్ అయ్యి యూట్యూబ్ ద్వారా అక్కడి ప్రేక్షకులను అలరించాయి. మొదటి సారి పుష్ప సినిమా తో బన్నీ పాన్ ఇండియా రేంజ్ లో సందడి చేయబోతున్నాడు. రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా నుండి ఇప్పటికే మూడు పాటలు విడుదల అయ్యి మంచి సక్సెస్ ను దక్కించుకున్నాయి.




# రోహిత్‌కు కూడా తెలుసు... అందుకే ఇషాన్‌ను పంపాం: టీమిండియా బ్యాటింగ్ కోచ్




టీ20 వరల్డ్‌కప్-2021 టోర్నీలో సెమీ ఫైనల్ చేరాలంటే కీలకంగా మారిన అక్టోబరు 31 నాటి మ్యాచ్‌లో పలు కీలక మార్పులతో బరిలోకి దిగింది టీమిండియా. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మకు బదులు ఇషాన్ కిషన్‌ను ఓపెనర్‌గా పంపించారు. గాయపడిన సూర్యకుమార్ యాదవ్ స్థానంలో జట్టులోకి వచ్చిన ఈ యువ వికెట్ కీపర్ బ్యాటర్‌ను ప్రమోట్ చేసింది. కానీ... ఆ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్(4) పూర్తిగా విఫలమయ్యాడు. అతనొక్కడే కాదు... మరో ఓపెనర్ కేఎల్ రాహుల్(18), వన్‌డౌన్‌లో వచ్చిన రోహిత్ శర్మ(14) , కెప్టెన్ కోహ్లి(9) చేతులెత్తేయడంతో తక్కువ స్కోరుకే పరిమితమైన కోహ్లి సేన కివీస్ చేతిలో 8 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిన సంగతి తెలిసిందే. దీంతో సెమీస్ అవకాశాలు సంక్లిష్టం కాగా.. టీమిండియా ఆట తీరుపై విమర్శలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తొలిసారి టీ20 ప్రపంచకప్ ఆడుతున్న ఇషాన్ కిషన్ వంటి యువ ఆటగాడిని ఓపెనర్‌గా పంపడం పట్ల భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు వెల్లడించాడు. "ఆ ముందురోజు రాత్రి సూర్య వెన్ను నొప్పితో బాధపడ్డాడు. మ్యాచ్ ఆడేందుకు తను సిద్ధంగా లేడు. అలాంటి సమయంలో సూర్య స్థానాన్ని భర్తీ చేయగల ఆటగాడు ఇషాన్ కిషన్ అని భావించాం. ఐపీఎల్‌లోనూ.. గతంలో జాతీయ జట్టు తరఫున తను ఓపెనింగ్ చేశాడు. దీంతో మేనేజ్‌మెంట్ అంతా ఓ చోట కూర్చుని చర్చోపచర్చలు జరిపాం. అంతేకాదు రోహిత్ శర్మ కూడా అందులో ఒకడు. ఆ చర్చలో తనూ పాల్గొన్నాడు. లెఫ్ట్ హ్యాండర్‌ను ప్రమోట్ చేయాలనుకున్నాం. మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, పంత్, జడేజా.. ఇలా అంతా ఎడమ చేతి వాటం గల బ్యాటర్లే. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇషాన్‌ను ప్రమోట్ చేయాలని నిర్ణయించాం" అని విక్రమ్ చెప్పారు. ఇక టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా భవిష్యత్తు ఎలా ఉండబోతున్న ప్రశ్నకు బదులుగా... "టీమిండియాలోని అత్యుత్తమ, నైపుణ్యం గల ఆటగాళ్లతో కలిసి పనిచేసిన అనుభవం ఎంతో గొప్పగా ఉంటుంది. ఇప్పటికే నేను బ్యాటింగ్ కోచ్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నా. మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకున్నా నేను సన్నద్ధంగా ఉంటాను" అని విక్రమ్ చెప్పుకొచ్చారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**